
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
1 జూన్ 2026
పేజీలు : 08





# భూ బాగోతం


## ఫోర్జరీ సంతకాలు.. ఫేక్ డాక్యుమెంట్లు

- ఫోటోలు ఒకరివి సంతకాలు మరొకరివి
- రైతులు లేకుండానే భూమి కాజేసిన వైనం
- అమాయకుడి సంతకం ఫోర్జరీ చేసి జీపీఏ సృష్టించిన వైనం
- షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు
- సబ్ రిజిస్టర్ పై కూడా ఫిర్యాదు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని విట్యాల గ్రామంలో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి, తప్పుడు పత్రాల ద్వారా కోట్లాది రూపాయల విలువైన భూమిని కాజేయడానికి ప్రయత్నించిన మాజీ సర్పంచ్‌పై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విట్యాల గ్రామానికి చెందిన కావాలి సురేష్‌కు సర్వే నంబర్ 124/అ 3A లో 18 గుంటల భూమి వారసత్వంగా వచ్చింది. ఈ భూమిపై సురేష్‌తో పాటు అతని అన్నదమ్ములు సమాన హక్కు కలిగి ఉన్నారు. అయితే, గత నెల 20వ తేదీన సురేష్ తన పొలానికి ఫెన్సింగ్ వేయడానికి వెళ్లగా, అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రశేఖ ర్ (తండ్రి: శివయ్య) మరియు అతని అనుచరులు అడ్డుకున్నారు. ఈ భూమి తమదేనని, తమ దగ్గర పత్రాలు ఉన్నాయని బెదిరించారు. దీనిపై బాధితుడు రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆరా తీయగా షాకింగ్ నిజాలు వెలుగు చూశాయి. సురేష్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, తప్పుడు జీపీఏ (G.P.A - 238/2016) సృష్టించినట్లు తేలింది. ఈ తప్పుడు పత్రాలను ఉపయోగించి బాధితుడికి తెలియకుండానే భూమిని ఇతర వ్యక్తులకు అమ్మకాలు చేసినట్లు పత్రాల ద్వారా స్పష్టమైంది. తాను ఎప్పుడూ ఎవరికీ భూమి అమ్మలేద ని, తన సంతకాన్ని తప్పుగా వాడి తప్పుడు ఆధార్ కార్డులు సృష్టించి డాక్యుమెంట్లలో ఫోటోలు ఒకరవి పెట్టి సంతకాలు మరొకరివి చేయించి తన ఆస్తిని కాజేయాలని చూస్తున్న మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ మరియు అతనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రా ల ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసి సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు ఎలాంటి వివరాలు తెలుసు కోకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి సబ్ రిజిస్టర్ పై కూడా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు పిర్యాదు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .





## రామంతపూర్‌లో డ్రగ్స్ దాడులు

### కోడైన్ సిరప్, ట్రమడోల్ స్వాధీనం

- అక్రమంగా నియంత్రిత ఔషధాల విక్రయం
- ఎస్ఎస్ఆర్ మెడికల్స్‌పై ఆకస్మిక తనిఖీలు
- యువతలో మత్తు దుర్వినియోగం పెరిగిన నేపథ్యం
- లైసెన్సుల రద్దు, చట్టపరమైన చర్యలు ఖాయం

## బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గురుతర బాధ్యతతో ఉండాలి

### గోషామహల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రత్యేక ఇంచార్జ్ గోశీడ్ల నాగేందర్ గౌడ్



## రూ.4 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి
- కాప్రా డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, ఓపెన్ జిమ్‌లు
- సీనియర్ సిటిజన్లు, యువత, పిల్లలకు ప్రత్యేక దృష్టి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



# నందివనపర్తిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**యాచారం, మే 31(జనం సాక్షి )** యాచారం మండలం నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2010-2011 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం స్థానిక డిఎస్ఆర్ గార్డెన్లో అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల విద్యాభ్యాసం ముగించుకుని సుదీర్ఘంగా 15 సంవత్సరాలైన సందర్భంగా, నాటి బాల్య స్నేహితులంతా ఒకే వేదికపైకి చేరుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పూర్వ ఉపాధ్యాయులు వంశీకృష్ణ, ధనంజయ, కొండయ్య, ప్రతాప్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నరసింహ, సంతోష్, రవికుమార్, గోపాల్, మల్లీశ్వరి, సులోచన, దైవపుష్ప, నాగమణి, శ్రీలతలను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో అమూల్యమైనదని, మధురానుభూతులతో కూడుకున్నదని పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామ ప్రజలు ఎంతో వినయ విధేయతలు, సంస్కారవంతులని కొనియాడారు. నేటి సమాజంలో తల్లిదండ్రులను విస్మరిస్తున్న ధోరణి బాధాకరమని, ప్రతి ఒక్కరూ కన్నవారిని ప్రేమ, అభిమానం మరియు గౌరవంతో చూసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘ కాలం తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ ప్రస్తుత వృత్తి, జీవన విధానాలను పంచుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాల్లో మునిగితేలారు. అనంతరం విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆత్మీయ కలయికతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిమ్స్‌కు అధునాతన ఏఎల్ఎస్ అంబులెన్స్ విరాళం



**ఖైరతాబాద్, మే 31 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)కు అత్యాధు నిక సదుపాయాలతో కూడిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్) అంబులెన్స్‌ను చెన్నై షాపింగ్ మాల్ విరాళంగా అందజేసింది.ప్రజారోగ్య సేవల ను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సంస్థ ఛైర్మన్ మర్రి వెంకట్ రెడ్డి, సీఈఓ శంకర్, సీఎఫ్‌వో సంజయ్ హెడా ఈ సేవా కార్యక్రమానికి సహకరిం చారు. ఈ విరాళ కార్యక్రమాన్ని హైదరాబాద్ యూత్ రౌండ్ టేబుల్ 304, హైదరాబాద్ యూత్ లేడీస్ సర్కిల్ 167 సంస్థలు తమ వార్షిక సేవా కార్యక్రమం 'రైజ్ అండ్ షైన్'లో భాగంగా సమన్వ యం చేశాయి. చెన్నై షాపింగ్ మాల్ ప్రతినిధులు, రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా సభ్యులు, నిమ్స్ అధికారులు పాల్గొన్న కార్యక్రమం లో అంబులెన్స్‌ను నిమ్స్‌కు అధికారికంగా అందజే శారు.ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డా.నగరి భీరప్ప మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్ యాజ మాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ అధునాతన అంబులెన్స్ ద్వారా రోగుల రవాణా, అత్యవసర వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందుబా టులోకి వచ్చి, అధిక సంఖ్యలో రోగులకు ప్రయో జనం చేకూరుతుందని పేర్కొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

### రాజశేఖర్ ఆవుటి మాజీ డీ.సీ.సీ అధికార ప్రతినిధి



**వికారాబాద్ మే 31(జనంసాక్షి)** తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని, ఆయనకు సముచితమైన మంత్రి పదవిని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ డి.సి.సి అధికార ప్రతినిధి రాజశేఖర్ ఆవుటి విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం: దళితులకు, బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడంలో భాగంగా స్పీకర్‌గా ఉన్న ప్రసాద్ కుమార్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. సేవలు, పూర్వ పాలన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పరిపాలనలో చేనేత మరియు జౌళి శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం, ఎంత మంది మాజి మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీలు మారినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాత్రము ఇతర రాజకీయ పార్టీలు, ఆశ చుపినా , ఆఫర్ చేసినా , ఒత్తిళ్లు చేసినా ఎవరికి తల వంచకుండా పార్టీలు మారకుండా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సేవలు అందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ముఖ్య నాయకులు అయిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ , మల్లికార్జున్ ఖర్గేల మీద ఉన్న నమ్మకము , కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నిష్టతో పాటించే వ్యక్తిత్వము ఆయన సొంతము , ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్పష్టమైన హామీ: ప్రసాద్ కుమార్‌కు కీలకమైన మంత్రిత్వ శాఖను అప్పగించడం ద్వారా పార్టీలోని అన్ని వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సానుకూలంగా స్పందించి, తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## యాలాల తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఎంఆర్ఓ గాయత్రికి ఘన సన్మానం



**యాలాల మే 31 ( జనంసాక్షి ) :** యాలాల మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఆర్ఓ గాయత్రిని గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య, ఉప సర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి పాల్గొని ఎంఆర్ఓ కి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా, 12వ వార్డు మెంబర్ బోయి ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు, బుర్జ్ణపూరి నర్సిములు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.నూతన ఎంఆర్ఓ గాయత్రి మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఆమెకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# నూతన అంగులాలతో దక్ష హై స్కూల్

- పదవ తరగతి ఫస్ట్ బ్యాచ్ లోనే 100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాల.
- తెలంగాణ ప్రభుత్వం చే గుర్తింపు పొందిన పాఠశాల.
- నర్సరీ నుండి పదవ తరగతి వరకు బోధన.



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి )** పాఠశాలలు ఎన్నో ఉంటాయి మెరుగైన బోధన అందించే పాఠశాలలు కొన్ని మాత్రమే ఉంటాయి. అందులో ఒకటి దక్ష హై స్కూల్ అని చెప్పవచు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సహకారంతో పదవ తరగతి ఫస్ట్ బ్యాచ్ లోనే 100% ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకుంది. ఈ పాఠశాల జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో ఉంది. గూడ రమేష్ ఈ పాఠశాలను నెలకొల్పి గత ఐదు సంవత్సరాల నుంచి విద్య బోధన అందిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో మొదటి పదవ తరగతి బ్యాచ్ లోనే 100% ఉత్తీర్ణత తీసుకొచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో భవ్య శ్రీ 6శీశీ మార్కులకు గాను 537 మార్కులు సాధించింది. స్వాతి 524 మార్కులు, తరుణ్ 507 మార్కులు . అక్షయ 496 మార్కులు, స్ఫూర్తి 489 మార్కులు, రితిక 444 మార్కులు, ప్రణవ సాయి 430 మార్కులు, సాయి తేజ 422 మార్కులు, ఇలా దక్షయ స్కూల్ విద్యార్థులు మొదటి బ్యాచ్ లోనే ప్రతిభను కనబరిచారు. పాఠశాల యాజమాన్యం బోధనలో కొంత మెరుగులు దిద్దెందుకు నూతన యజమాన్యని తీసుకోవడంజరిగింది. అనుభవజ్ఞులైన నూతన యజమాన్యంతో విద్యా బోధన అందిస్తూ విద్యార్థులలో మరింత ప్రతిభను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ పాఠశాల ప్రత్యేకతలు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయునిచే బోధన. డిజిటల్ మద్యమంలో బోధన.విశాలమైన తర్వాత గదులు. వెనకబడిన విద్యార్థులకు అదనపు శ్రద్ధతో స్టడీ అవర్స్. కంప్యూటర్ క్లాసులు. సంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడాలు,యోగ,మార్షల్ ఆర్ట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం జనం సాక్షి రాసిన కథనానికి వివరణ ఇచ్చారు.పాఠశాల నిర్వహించేందుకు, విద్యార్థులకు బోధన అందించేందుకు, ఉన్నంత విద్యభ్యాసం చేసి ఉన్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చ్చే గుర్తింపు పొందిన దక్ష పాఠశాలలో విద్యార్థులకు బోధనా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను మెరుగు దిద్దెందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# మాసుల రజియా బేగం కన్నుమూత

- అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం.
- గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు.



**తాండూరు మే 31 (జనంసాక్షి)** నియోజకవర్గంలోని యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన మాసుల మొగులాన్ మాతృమూర్తి మాసుల రజియా బేగం అనారోగ్యంతో మరణించారు.కుటుంబ సభ్యుల దుఃఖంలో పాలుపంచుకుంటూ, గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. రజియా బేగం మృతికి సంతాపం తెలుపుతూ నాయకులు మాసుల ఖాసిం, మెట్లి కృష్ణ, యంఆర్ పిఎస్ మండల అధ్యక్షులు మెట్లి సూర్యప్రకాష్, వార్డు సభ్యులు గుడ్ల చంద్రయ్య, యం. కృష్ణ తదితరులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. వారు కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రజియాకి నివాళులర్పించారు.

### మాజీ అధ్యక్షులు అయ్యా గాళ్ళ భీమయ్య,

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత



**యాలాల మే 31(జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన మాసుల రజియా బేగం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న యాలాల మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యా గాళ్ళ భీమయ్య, తదితరులు చేతుల మీదుగా మృతి చెందిన రజియా భేగం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మకమిటి డైరెక్టర్ గోరేపల్లి బల్ రాం, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఖాసీం, మాసుల ఖాసీం, శ్రీను, దేవుల తండా సర్పంచ్ మోహన్ నాయక్, నంద కుమార్, ఆకుల ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో 108 సిబ్బంది సమయస్ఫూర్తి

## 3 రోజుల పసికందుకు సీపిఆర్‌తో పునర్జన్మ




**తాండూరు మే 31(జనంసాక్షి)** మాతా శిశు ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా శ్వాస ఆడక విలవిలలాడిన 3 రోజుల నవజాత శిశువుకు 108 సిబ్బంది సీపిఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. తాండూరు మాతా శిశు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 3 రోజుల బాబు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో బాబుకు ఒక్కసారిగా శ్వాస ఆడటం ఆగిపోయింది. శరీరం నీలం రంగులోకి మారిపోయింది. పరిస్థితిని గమనించిన ఈయంటి శాంతు కుమార్ వెంటనే అప్రమత్తమయ్యారు. అంబులెన్స్‌ను పక్కకు ఆపించి, పైలెట్ అయూబ్ పాషా సహకారంతో బాబుకు సీపిఆర్ ప్రారంభించారు. సుమారు కొన్ని నిమిషాల పాటు సిపిఆర్ చేసిన తర్వాత బాబులో కదలిక వచ్చింది. మెల్లగా శ్వాస తీసుకోవడం మొదలుపెట్టాడు. అనంతరం బాబును సురక్షితంగా హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నాడు. సిబ్బందిపై ప్రశంసలు అత్యవసర సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి, వృత్తి నైపుణ్యంతో 3 రోజుల పసికందు ప్రాణాలు కాపాడిన ఈయంటి శాంతు కుమార్, పైలెట్ అయూబ్ పాషాలను తల్లిదండ్రులు, వైద్యులు, స్థానికులు అభినందించారు. 108 సేవలు అత్యవసర సమయంలో ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి



**అబ్దుల్లాపూర్మెట్, మే 31 (జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన అనుప్ రెడ్డి అమెరికాలో మృతి చెందాడు. ఆయన అమెరికాలోని లూసియాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నంలో అనుప్ రెడ్డి మృత్యువాత పడ్డాడు. ఫిషింగ్ వైర్ కాలుకు చిక్కుకోవడంతో నీటిలోనే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అనుప్ రెడ్డి మృతితో కవాడిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, మే31 ( జనం సాక్షి) :** పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నేమూరీ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సిరీ ఫంక్షన్ హాల్ చక్రి పురంలో నిర్వహించిన సార్, బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ బూత్ లెవల్ సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శివకుమార్ గౌడ్, జె ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్, రాజు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే దిక్సూచిగా కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్

- శంకుస్థాపన పనులను పరిశీలించిన వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**అబ్దుల్లాపూర్మెట్, మే 31 (జనం సాక్షి ):** కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ దేశానికే తలమానికంగా నిలుస్తుందని, భవిష్యత్ 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతికతతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ (ఐఏఎస్) తెలిపారు. ఆదివారం కోహెడ మార్కెట్ శంకుస్థాపన నిర్మాణ పనులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంతకుముందు కోహెడ గుట్టపై ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. త్వరలో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతారని, వేలాది మంది రైతులు, మహిళలు పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులు సభా ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు, మార్పులను సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాకా డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి (ఐఏఎస్), గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి (ఐఏఎస్), ఆగ్రోస్ ఎండీ రాములు, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రవికుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు జైపాల్ రెడ్డి, మధుసూదన్ రావు, అంజయ్య, మేకం లక్ష్మి, రఘుపతి రెడ్డి, నవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బండరావిరాలలో ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు

- పాజెక్టును నిలిపివేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: సర్పంచ్ విజయ్ కుమార్
- ప్రజాభిప్రాయం లేకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు సరికాదు
- పర్యావరణ నిపుణురాలు దుబ్బ గీత



**అబ్దుల్లాపూర్మెట్, మే 31 (జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో ప్రతిపాదిత 'ఎకో టౌన్' (డంపింగ్ యార్డు) ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పర్యావరణ ఇంజనీర్ దుబ్బ గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా ఇలాంటి భారీ ప్రాజెక్టులను చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. డంపింగ్ యార్డుల వల్ల వెలువడే విషవాయువులు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హానికరమని హెచ్చరించారు. అనంతరం ఎకో టౌన్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించే కరపత్రాన్ని విడుదల చేశారు. సర్పంచ్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా పలు గ్రామ పంచాయతీల తీర్మానాలను ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖలకు అందజేసినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సర్పంచ్ పదవికి రాజీనామా చేయడానికీ సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు

## పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, మే 31 (జనం సాక్షి):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. కాలనీవాసులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవల కాలనీలో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తెలుసుకున్న రజిత పరమేశ్వర్ రెడ్డి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రస్తుతం రూ.60 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వర్షాకాలానికి ముందే డ్రైనేజీ పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరాం. త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వినాయక్ నగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం" అని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటం ద్వారా వర్షపు నీరు నిల్వ ఉండే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కాలనీలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న పనులు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తాయని రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు.

# ఉప్పల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ -2026 ముగింపు

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాల ప్రదానం
- క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి : ఎంపీ ఈటల రాజేందర్



**ఉప్పల్, మే 31 (జనం సాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్--2026 ఆదివారం ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఘనంగా ముగిసింది. ఉప్పల్ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో 78 కేంద్రాల ద్వారా 12 క్రీడా విభాగాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ యువ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌ను పరిశీలించి అభినందించారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఉందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యార్థులు క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు. గతంలో పాఠశాలల్లో విశాలమైన క్రీడా మైదానాలు, ప్రత్యేక శారీరక విద్య ఉపాధ్యాయులు ఉండేవారని, ప్రస్తుతం పట్టణీకరణ పెరగడంతో చాలా పాఠశాలలు పరిమిత స్థలంలోనే కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులకు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు.నేటి తరం విద్యార్థులు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, డిజిటల్ పరికరాలకే పరిమితమవుతున్న నేపథ్యంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలు, సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందడంతో పాటు వివిధ క్రీడా విభాగాల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్‌లో పాల్గొన్న నవజీవన్ రెడ్డి






**హయత్ నగర్, మే 31 (జనం సాక్షి)** బీజేపీ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బండ్లగూడ లోని శ్రేయస్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్ - 2026 జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, కార్యకర్తల పాత్ర, ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై నిర్వహించిన వివిధ సెషన్లను ఆసక్తిగా విన్నారు. పార్టీ అభివృద్ధి, కార్యకర్తల శిక్షణ, ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేసేందుకు ఇటువంటి శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు విధించడం సమంజసం కాదు

- తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశీ రావు,,పూజారి రమేశ





**ఇబ్రహీంపట్నం, మే 31(జనం సాక్షి )** ఉపాధ్యాయ హెల్త్‌కార్డులకుసంబంధించిన విధివిధానాలు ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో కనీస చర్చలు జరపకుండా ఉపాధ్యాయుల జీతాల నుండి ప్రీమియం వసూలు చేయడం సరికాదని తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశీ రావు, పూజరి రమేశ్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారికంగా హెల్త్ కార్డులు జారీ చేయకుండా, పథకంపై పూర్తి సమాచారం ఇవ్వకుండానే ముందస్తుగా జీతాల్లో కోత విధించడం ఉపాధ్యాయులను మోసగించడమేనని వారు ఆరోపించారు.ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ముందు పలు ప్రధాన డిమాండ్లను ఉంచారు. అప్పటివరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని ఉపాధ్యాయులకు వెంటనే తిరిగి చెల్లించాలని, స్పష్టమైన విధివిధానాలు ప్రకటించి, కార్డులు జారీ చేశాకే కోతలు చేపట్టాలని కోరారు. ఈ హెల్త్ కార్డు పథకం ఇష్టం లేని వారికి దాని నుండి మినహాయింపు కల్పించాలని, ఇద్దరు ఉద్యోగులైన భార్యాభర్తల విషయంలో ఒకరి జీతం నుండే ప్రీమియం వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యువతీ యువకులకు కూడా ఈ పథకం వర్తించేలా, డిపెండెంట్లకు వయోపరిమితిని 25 నుండి 35 సంవత్సరాలకు పెంచాలని, సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన ప్రీమియం విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# హైకోర్టు 'స్టే' ఉన్నా యాచారం ఫార్మాసిటీలో జెసిపిలతో భూముల ధ్వంసం

## తెలంగాణ జన సమితి ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జ్ సామ నిరంజన్



**యాచారం, మే 31(జనం సాక్షి )** యాచారం మండలం ఫార్మాసిటీ బాధిత గ్రామాలలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ జన సమితి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ నిరంజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఫార్మాసిటీకి ఇచ్చిన భూములను మాత్రమే స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పి, నిన్న మేడిపల్లి గ్రామంలో గౌరవ హైకోర్టు స్టే ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ హిటాచీలు, జెసిపిలతో రైతుల భూములను చదును చేయడం దుర్మార్గామని మండిపడ్డారు.ఈ సందర్భంగా సామ నిరంజన్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది నాలుగు గ్రామాల రైతుల భూములకు అథారిటీ కోర్టులో ఎలాంటి భూ పొజిషన్ చూడకుండా, ఏకపక్షంగా భూ పరిహారాన్ని జమ చేయడం జరిగిందన్నారు. నేడు కొంతమంది రైతులు వారి అప్పుల మూలంగానో, పిల్లల పెళ్లిళ్ల అవసరాలకు గానో భూములు ఇద్దామని వెళితే.. అధికారులు రకరకాల ఆధారాలతో కూడిన సాంకేతిక సమస్యలను సష్టించి పరిహారాన్ని సకాలంలో ఇవ్వకుండా అమాయక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. "మా భూముల పైసలు మేము తీసుకోవడానికి కూడా ఇదొక శిక్షా?" అని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగు గ్రామాలలో ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల భూములను వదిలిపెట్టాలని గతంలోనే జిల్లా కలెక్టర్ , ఆర్డీవో , ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు విన్నవించుకోవడం జరిగిందని గుర్తు చేశారు.ప్రతి ఊరి భవిష్యత్తు అవసరాల కోసం కనీసం 100, 200 లేదా 300 ఎకరాల భూములను వదిలిపెడితే, కొందరు రైతులు వ్యవసాయం చేస్తూ రైతు కూలీలకు, నిరుపేదలకు, కులవృత్తుల వారికి ఉపాధి కల్పించినట్టుగా ఉంటుందని సూచించారు. నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల భూములను దయచేసి వదిలిపెట్టాలని, ఒకవేళ భూములు తీసుకోవాలనుకుంటే పక్కనే ఉన్న కందుకూరు మండలంలో ఎంతైతే పరిహారం ఇస్తున్నారో, అదే తరహాలో ఇక్కడి రైతులకు కూడా సమానంగా పరిహారాన్ని చెల్లించాలని కోరారు. అలాగే ఇప్పటికే నాలుగు గ్రామాలలో పనులు దొరకక రైతు కూలీలు, కుల వృత్తుల వారు రోడ్డున పడ్డారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇంటింటికి కోటి రూపాయల పరిహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ నాలుగు గ్రామాల యందు దయతలిచి, ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల భూములను వదిలిపెట్టి, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎంఈఓ నిరంజన్‌కు ఘన వీడ్కోలు



**రాజేంద్రనగర్,మే31(జనంసాక్షి)** గండిపేట మండల విద్యాధికారి, మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన నిరంజన్ పదవీ విరమణ చేయడంతో పాఠశాలలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఫ్లోర్ లీడర్ కే. రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఆయన విద్యారంగ సేవలను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శ్రవణ్ కుమార్, శివగంగ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో తొలి మూడు స్థానాలు సాధించిన దివ్య, భానుప్రసాద్ గౌడ్, వేంకట సాత్వికలకు గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక ఆర్థిక సహాయం అందించింది. సోషల్ స్టడీస్‌లో 100/100 మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా సన్మానించారు.గత ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థిని స్వాతి ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించడంతో, ఆమె ఉన్నత విద్య కోసం కె. రామకృష్ణ రెడ్డి రూ.25 వేల చెక్కు, సామాజికవేత్త మంచికంటి సంతోష్ కుమార్ రూ.10 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు సహాయం కొనసాగిస్తామని వారు తెలిపారు.

# అను ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్



**కాప్రా, మే 3 (జనం సాక్షి ) :** నాణ్యమైన, రుచికరమైన ఆహార భోజనాన్ని అందించి భోజన ప్రియుల మన్ననలను పొందాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈసీఐఎల్ బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన అను ఫుడ్ కోర్ట్ ను ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్వాహకులు వెంకట్ రెడ్డి ఈసీఐఎల్ లో అను ఫుడ్ కోర్ట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించే ఇలాంటి సంస్థలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో అడుగుపెడుతున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు వెంక రెడ్డి మాట్లాడుతూ అను ఫుడ్ కోర్ట్‌లో వెజ్ ,నాన్-వెజ్ వంటకాలతో పాటు మిల్లెట్స్ ,టిఫిన్స్, మీల్స్, బిర్యానీ, చైనీస్ తదితర రుచికరమైన వంటకాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి , బేతల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కాప్రా, మే31 ( జనం సాక్షి ) :** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నియోజవర్గ పరిధిలోని కాప్రా డివిజన్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా సీనియర్ సిటిజన్ కాలనీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు రూ.40 లక్షలు, సాకేత్ కాలనీలో ఓపెన్ జిమ్ మరియు చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు -- రూ.25 లక్షలు వోర్లా ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు -- రూ.60 లక్షలు, కాప్రా నాలా నుండి సాయి సుమా టీ-జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు, రూ.2.50 కోట్లు, గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు రూ.20 లక్షలు,మొత్తంగా సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కాప్రా డివిజన్‌లో మౌలిక వసతులు మరింత మెరుగుపడి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరి నవీన్ గౌడ్, మరాఠి రవీందర్రావు, మల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## శ్రీ సాయి కాలనీ ఫేస్ 2 నూతన కార్యవర్గం ఎన్నిక



**హయత్ నగర్, మే 31 (జనం సాక్షి)** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి కాలనీ ఫేస్ 2 కు జరిగిన ఎన్నికలలో అధ్యక్షులు భీంరెడ్డి సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందివెలుగు వెంకట రామారావు, కోశాధికారి గా నేరెళ్ల రాంచందర్ రావు లను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఎన్నికల అధికారి పిడుగు శ్రీనివాస్ ముదిరాజు తెలిపారు. ఉపాధ్యక్షులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, గుర్రం మార్కండేయ నేత, సహాయ కార్యదర్శి కేశవరపు యాదయ్య చారి, గౌరవ సభ్యులుగా పిడుగు శ్రీనివాస్, గార్లపాటి జంగారెడ్డి లను ఎన్నికైనారు. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షులు పెద్దగోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న, కోశాది కారి కుందేటి రాజారావు, మూర్తి లు భాధ్యతలను నూతన కమిటీ కి అప్పగించారు. ఈ కార్యక్రమం లో కాలనీ పెద్దలు చంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పూర్ణ చందర్ రావు, ముత్యాలు, సేతు మాధవ రావు, శ్రీనివాస్ రావు, సోమయ్య, భాగ్యమ్మ లు పాల్గొని, నూతన కమిటీ నీ కాలనీ సభ్యులను అభినందించి, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భీమ్ రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ సాయి కాలనీ ఫేస్ 2 నూతన అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్న కాలనీవాసులందరికీ నందనలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, మీ అందరి సహాయ సహకారాలతో కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కాలనీ సభ్యులు అందరం ఒక కుటుంబం లాగా ఉండి, ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా, కాలనీ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

## ఎరుకల నాంచారమ్మ బస్తి నూతన అధ్యక్షునిగా జగన్నాధం గంగయ్య ఎన్నిక



**హయత్ నగర్, మే 31 (జనం సాక్షి)** జి ఎస్ ఐ డివిజన్ పరిధిలోని ని ఎరుకల నాంచారమ్మా బస్తీ (ఆదర్శ నగర్)డబల్ బెడ్ రూమ్ లలో జరిగిన ఎన్నికలలో మొత్తం 288 ఓట్ల కు గాను 280 పోలయ్యాయి. అందులో 3 చెల్లనివి, 277 చెల్లినవి అందులో జగన్నాధం గంగయ్య కు 126, గోపు శివ 87, గుంజ బాలరాజు కు 33, వనం రాజు కు 31 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికలలో జగన్నాధం గంగయ్య 39 ఓట్ల మెజార్టీ తో అధ్యక్షునిగా గెలుపొందారని ఎన్నికల నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా జగన్నాధం గంగయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను గెలిపించిన ఎరుకల నాంచారమ్మ బస్తి (ఆదర్శనగర్) డబుల్ బెడ్ రూమ్ వాసులందరికీ అభినందనలు తెలియజేశారు. కాలనీ లో నీటి, విధ్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ పచ్చదనం, పరిశుభ్రత, లిఫ్ట్ లు సక్రమంగా పనిచేయడం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీవాసులు సహాయ, సహకారాలతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## మౌలాలి సాగర ఉప్పర సంఘం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా కాసాని వెంకటస్వామి సాగర్



**మల్కాజిగిరి మే 31 (జనంసాక్షి)** మౌలాలి సర్కిల్ 186 డివిజన్ పరిధిలోని శ్రామిక నగర్ సాగర ఉప్పర సంఘం నూతన కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మంద భాస్కర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కాసాని వెంకటస్వామి సాగర్, ప్రధాన కార్యదర్శిగా బుద్ధుడు సాగర్, కోశాధికారిగా లక్ష్మణ్ సాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సలీం, మరియు నాయకులు చందు, వెంకటేష్, సిహెచ్ రాములు, బన్నీ, మామూదాబేగం, నరసింహ, రవి ముదిరాజ్, జానకిరామ్ సాగర్, మధు సాగర్, సాయిలు సాగర్, వెంకటేష్ సాగర్ తదితరులు నూతన కమిటీ సభ్యులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.గతంలో సాగర సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషి చేసిన మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావుకు ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు, సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## దేవరయాంజాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ




**శామీర్ పేట్, మే 31(జనం సాక్షి )** శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవరయాంజాల్‌లో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం వద్ద తూంకుంటకు చెందిన ఆర్ఎక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఉచిత వైద్య శిబిరా లను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ కృష్ణ మరియు వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు,సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై వైద్య సేవలను పొందారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆర్ఎక్స్ హాస్పిటల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని,ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు.ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆర్ఎక్స్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు మరియు సిబ్బందికి స్థానిక నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పిన్నింటి ధర్మారెడ్డి,పట్నం నర్సింహా రెడ్డి,ఘనపూర్ రాజు తదితరులు పాల్గొని శిబిరాన్ని సందర్శించారు.

## దళితుల జోలికొస్తే ఊరుకోము : మోత్కుపల్లి నరసింహులు



**అబ్దుల్లాపూర్‌మెట్, మే 31(జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో నిర్వహించిన మాదిగ మహాశక్తి కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు.బండరావిరాల పరిధిలోని 135 ఎకరాల దళితుల భూమిని గతంలో మైనింగ్‌కు అప్పగించారని, ఇప్పుడు అదే ప్రాంతంలో ఎకో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలను దళితులు సహించబోరని ఆయన అన్నారు. దళిత రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.10 కోట్ల పరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తి బాధ్యత వహించాలని, లేకుంటే అది ఎమ్మెల్యే చేతకానితనానికి నిదర్శనమవుతుందని విమర్శించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దళితుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో వివిధ బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలకు అంకిత భావంతో సేవలందించే ఉద్యోగులకు తగిన గుర్తింపు

### తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ అధ్యక్షుడు పి.ప్రవీణ్



**ముషీరాబాద్, మే 31( జనం సాక్షి):** ప్రజలకు అంకిత భావంతో సేవలందించే ఉద్యోగులకు ప్రజల్లో శాశ్వతంగా గుర్తింపు ఉంటుందని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ (అజామాబాద్ డివిజన్) అధ్యక్షుడు పి.ప్రవీణ్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం లైనమాన్ వలబోజు కాళిదాస్ చారి పదవీ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వలబోజు కాళిదాసు చారి, పద్మావతి దంపతులను యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ వలబోజు కాళిదాసు చారి ఎంతో నిబద్ధతో పనిచేశారని, ఆయన అనుభవాలు, సూచనలు నేటి తరం ఉద్యోగులు తీసుకోవాలు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జీ.ఎం.ప్రభాకర్, రీజినల్ ప్రెసిడెంట అంజిరెడ్డి, సత్యషీలా రెడ్డి, బి.గణేష్, కాళీదాస్ చారి సభ్యులు వి.రవితేజ, బాలు ప్రశాంత్, జగదీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



జిల్లేడు చౌదరిగుడా (జనం సాక్షి ) తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్న పలు ఎంపీడీవోలను బదిలీలు చేయడం జరిగింది. జనరల్ బదిలీలో భాగంగా జిల్లేడు చౌదరిగుడా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ శంకర్పల్లికి బదిలీపై వెళ్లడం జరిగింది. ఆదివారం నాడు చివరి రోజు కావడంతో చార్జ్ తీసుకొని శంకరపల్లి లో సబ్మిట్ చేసేందుకు వెళ్లడం జరిగింది. తన విధి నిర్వహణలో సర్పంచులు గాని మాజీ ఎంపీటీసీలు గాని కార్యదర్శిలు గాని ఎవరినైనా విసిగించినట్లు ఉంటే మన్నించండి అని పేర్కొన్నారు మీకు హన్మంత్ రెడ్డి ఎంపీడీఓ గా బాధ్యతలు స్వీకరించరాణి పేర్కొన్నారు.

# హజరత్ నౌషా బాలే సాహెబ్ ఉరుసు ఉత్సవాలు



**యాలాల మే 31(జనంసాక్షి)** యాలాల మండల కేంద్రంలోని ప్రసిద్ధ దర్గా హజరత్ నౌషా బాలే సాహెబ్ వారి వార్షిక ఉరుసు షరీఫ్ ఉత్సవాలు ఈ ఏడాది మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.దర్గా కమిటీ అధ్యక్షులు గంతల్ మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మొదటి రోజు జూన్2న సందల్ కార్యక్రమం రెండవ రోజు 3న చిరాగాన్ ,మూడవ రోజు 4వ తేదీ నా జియారత్ , మహబ్బత్ కలిగిన భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఉరుసు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అల్లాహ్ దయతో ఉత్సవాలు క్షేమంగా, ఘనంగా జరగాలని ఆకాంక్షించారు. కమిటీ సభ్యులు గఫార్ భాయ్, దర్గా ఆరిఫ్, కారణకోట్ రజాక్, అక్రమ్, ఖాజా బేగ్, హాసన్ ఖాన్ సాబ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ తెలిపింది.

# గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య సభ్యులను సద్విని చేసుకోవాలి

- ముస్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి,
- జీర్ణకోశ క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన డా.విమలాకర్ రెడ్డి



**చేవెళ్ల, మే 31 (జనంసాక్షి)** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కోసం ఉచిత వైద్యశిభిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమాతా వెంకట్ రెడ్డి తెలిపారు. కిమ్స్ ఫౌండేషన్, టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామేనా శివారులో ఉన్న సంస్కృతి పాఠశాలలో ఆదివారం ఉచిత జీర్ణకోశ క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులకు వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుటుందన్నారు. ఉచిత వైద్యశిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యశిభిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. నిర్వహకులను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని ఉద్దేశించి టీం విమలాకర్ ఫౌండేషన్ ప్రతినిధి విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జీర్ణకోశ క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, సుచితా బల్వాంత్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రేహానా, సర్పంచి మనీలా నరహరి రెడ్డి, వైద్య బృందం సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు

# బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గురుతర బాధ్యతతో ఉండాలి

- గోషామహల్ నియోజకవర్గ బిఆర్ఎస్పార్టీ సభ్యత్వ నమోదు..
- ప్రత్యేక ఇంచార్జ్ గోశీడ్ల నాగేందర్ గౌడ్.



**ముషీరాబాద్, మే 31 (జనం సాక్షి):** రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై గురుతర బాధ్యత ఉండాలని టిఎస్ఈ డబ్ల్యూఐడిసిమాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ గోషామహల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రత్యేక ఇంచార్జ్ గోశీడ్ల నాగేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్, బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం గోషామహల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం మాజీ గ్రంథాలయ సంస్థ గడ్డం చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా గోండ్ల నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ ఐక్యతో ఉండి రాజకీయంలో విభేదాలు వీడి వేరే పార్టీ వారితో రాజకీయ పరంగాఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి బిఆర్ఎస్ పార్టీ గెలుపు కృషి చేయాలన్నారు. అదేవిధంగా డిజిటల్ సభ్యత నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు చురుకైన పాత్రపోషించాలన్నారు పార్టీలో నిరంతరం పని చేసే వారికే పదవుల్లో గుర్తింపు వస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హామీలను నెరవేర్చడంలో, నిలబెట్టడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సన్నద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో గోషామహల్ అసెంబ్లీ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఆర్. వి మహేందర్,మాజీ గ్రంథాల కమిటీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్,వివిధ డివిజన్ అధ్యక్షులు జి శ్రీనివాస్ యాదవ్, హుస్సేన్ ,శ్రీనివాస్ యాదవ్ ఎం. శ్రీనివాస్ గౌడ్, బిజిని శ్రీనివాస్, మహిళా నాయకురాలు శాంతి దేవి, కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

# 11 ఏళ్ల కలయిక ... అవదుల్లేని ఆనందం

## ఘనంగా 2014 -15 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**యాచారం మే 31 ( జనం సాక్షి ) :** ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే. ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు.. భావోద్వేగ సన్నివేశాలు వెరసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికయ్యింది. యాచారం మండలం కురిమిద్ద ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి 2014 - 15వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు కురిమిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు 11 సంవత్సరాల తర్వాత కలుసుకొని చాలా ఉత్సాహంగా గడిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేపట్టారు. గతాన్ని నెమరేసుకొనీ.. ఆనందంగా గడిపారు. ఒకరితో ఒకరు గతాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో స్థిరపడినవారు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. మానవ జీవితంలో కులమతాలకు అతీతంగా ఉన్నది కేవలం ఒక స్నేహం మాత్రమేనని అన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయిని ఎదిగిన స్నేహాన్ని మాత్రం మరువలేమన్నారు. భవిష్యత్తులో ఎవరి ఏ కష్టం వచ్చిన తోటి విద్యార్థులకు అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నారు. తాము కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి తీపీ గుర్తులను నెమరువేసుకున్నారు. 11 సంవత్సరాల తర్వాత ఇలాంటి వేడుక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలో సెటిల్ అవ్వడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను తలుచుకుంటూ, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా, సంతోషంగా ఆడి పాడారు. ఆనాడు గురువులు తమకు బోధించిన బోధనలు సూచించిన మార్గాలు నేర్పిన క్రమశిక్షణనే తమను ప్రస్తుతం సమాజంలో ఇంతటి ఉన్నత స్థానంలో నిలబడగలిగేలా ప్రేరేపించాయనీ ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 11 సంవత్సరాల తర్వాత స్నేహితులంతా ఒకేచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 11 సంవత్సరాల తర్వాత అందరం కలుసుకొని ఇలాంటి వేడుక నిర్వహించడం, విధ్యార్థులు వివిధ రంగాలలో రాణించడం ఎంతో గర్వంగా ఉందని నాటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో విధ్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం బైకనీ శ్రీశైలం యొక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అలనాటి గురువులకు జ్ఞాపికలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, నాటి ఉపాధ్యాయులు అంజయ్య, వెంకటేశ్వర్ రావు, జగన్ మోహన్, రాజేష్, అన్నపూర్ణ, వెంకటచారీ, శ్రీనివాస్, మహేష్, సురేష్, పూర్వ విద్యార్థులు పంది శ్రీనివాస్, నీలం మధు, ఎస్.జగదీష్, నవీన్, ప్రవీణ్, ఎస్.శ్రీను, గోపాల్, వినోద్, శ్రీధర్, రాజు, మణికంత, కిరణ్, స్వామి, ఉమ, జ్యోతి, అఖిల, ప్రియాంక, లావణ్య, మౌనిక, శోభ, రోజా, పూజిత, మానస, పద్మ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను

## ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి



హయత్ నగర్, మే 31 (జనం సాక్షి) మన మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరభోగ వసంతరాయ నగర్ (అమ్మదయ కాలనీ)సంక్షేమ సంఘం, లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని శివగంగా కాలనీ సంక్షేమ సంఘం వారితో బిఆర్ఎస్ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి తో కలిసి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని వారి ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి ఈ కాలనీలలో ఉన్న పలు సమస్యలు, కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరంగా తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో సమస్యల గురించి మాట్లాడి, వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సత్కారం



**శంషాబాద్,మే31(జనంసాక్షి)** శంషాబాద్ మండలంలోని పెద్దతూప్రా గ్రామంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు బొద్దం మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువకులను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గ్రామస్థులు, నిర్వాహకులు బొద్దం మహేష్ యాదవ్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, నేత చంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్



**బోడుప్పల్-జనంసాక్షి** బోడుప్పల్ సర్కిల్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ సొంతింటి కల సాకారం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సొంత గృహం కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దానగళ్ల యాదగిరి, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని గృహ ప్రవేశం చేసిన కుటుంబాలను అభినందించారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు కమ్యూనిటీ సభ్యులు, రాజీవ్ నగర్ ఫేజ్--2 కాలనీ అధ్యక్షుడు దామెర నరేష్, అంబేద్కర్ నగర్ ఫేజ్--3 ప్రధాన కార్యదర్శి సత్యం చారి, పృథ్వి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన కమ్యూనిటీ సభ్యులు నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న బొమ్మక్ కళ్యాణ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## శ్రీ దుర్గా మాత ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



**శామీర్ పేట, మే 31( జనం సాక్షి )** శ్రీ దుర్గా మాత ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. అలియాబాద్ మున్సిపల్ మజీద్ పూర్ పరిధిలోని శ్రీ దుర్గా మాత ఆలయం వద్ద అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం పౌర్ణమి రావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి అన్నదానం చేపట్టారు. కేశవరం కు చెందిన బి. నాగరాజు, పడాల భానుమతి, అబ్బగాని భాస్కర్ గౌడ్ సహకారంచగా పల్లె సీతారాములు గౌడ్ 50 కేజీల బియ్యం, తుంకి కుమార్ ( మాజీ ఉపసర్పంచ్) 50 కేజీల బియ్యం, రాకల నాగేష్ గౌడ్ 25 కేజీల బియ్యం అన్నదానానికి అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

### ఇంటింటికీ వెళ్లి ప్రజల గోడు విన్న జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ వినాయక్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలతో కలిసి విస్తృత స్థాయి ప్రజా పర్యటన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు.

**తాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు :**
కాలనీలో ప్రధాన సమస్యగా తాగునీటి కొరత ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నుంచి ఐదు రోజులకోసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుండటంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందని ప్రజలు వాపోయారు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు వెంటనే స్పందించి కనీసం వారానికి రెండు రోజులైనా క్రమబద్ధమైన నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

**విద్యుత్ స్తంభాల సమస్యతో ప్రమాద భయం :**
కాలనీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయి నెలల తరబడి అలాగే ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో దెబ్బతిన్న స్తంభాలు ఉండటం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొందన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

**చెత్త కుప్పలతో దయనీయంగా మారిన పారిశుద్ధ్యం:**
వినాయక్ నగర్‌లోని అనేక గల్లీలు, ఖాళీ స్థలాలు చెత్త కుప్పలతో నిండిపోయిన దృశ్యాలను బీఆర్ఎస్ నాయకులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్లాట్లలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని స్థానికులు వివరించారు. చెత్త కుప్పల్లో పందులు, ఎలుకలు, వీధి కుక్కలు సంచరిస్తూ ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని, చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారని ప్రజలు మండిపడ్డారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ఆవేదన:** ప్రజా పర్యటన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా పలువురు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇల్లు వస్తుందనే ఆశతో దరఖాస్తు చేసుకున్న పేద కుటుంబాలకు వివిధ కారణాలు చూపుతూ అన్యాయం జరుగుతోందని వాపోయారు. "ఇందిరమ్మ ఇల్లు కావాలని అడిగితే పేదవాడి పరిస్థితిని చూడకుండా, 'నీ ఇల్లాలు మెడలో పుస్తెల తాడు ఉందిగా' అని కాంగ్రెస్ నాయకులు సమాధానం చెబుతున్నారు. సొంత ఇల్లు లేని కుటుంబం కష్టాలు కనిపించడం లేదు కానీ మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడు మాత్రం కనిపిస్తోంది. పేదల కన్నీళ్లను తుడవాల్సిన ప్రభుత్వం అర్హులను అనర్హులుగా మార్చే పనిలో పడింది. ఇదేనా కాంగ్రెస్ చెప్పిన సామాజిక న్యాయం? ఇదేనా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు?" అని ప్రశ్నించారు. అధికారుల తక్షణ స్పందన ప్రజల సమస్యలను విన్న బీఆర్ఎస్ నాయకులు వెంటనే మున్సిపల్, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితి తీవ్రతను వివరించారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్ శాఖ అధికారులు దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వగా, జలమండలి అధికారులు నీటి సరఫరా సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, గృహ నిర్మాణ పథకాల వంటి అంశాల్లో ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరి మహేష్, కొడె పోచయ్య, నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, మల్లం వెంకటేష్, మేడబోయిన విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, అక్కల శ్రీనివాస్, ఆంజనేయులు, యాసారం శ్రీనివాస్, శ్యామల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్,మునికుంట్ల కిరణ్ గౌడ్, కోనేటి వెంకన్న, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, పాశం నరేందర్ రెడ్డి,సతీష్, శ్రీనివాస్ రెడ్డి, రాయాల అశోక్, అమర్ పటేల్, తిరుమలేష్,మధుసూదన్, పుల్ల శ్రీనివాస్, వారికల శ్రీనివాస్, కైసర్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి

### టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్



**చేవెళ్ల, మే 31 (జనంసాక్షి)** సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన డీఏ (కరువు భత్యం) బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర కార్యదర్శి గణపురం సురధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించే డీఏ బకాయిల్లో 10 శాతం మొత్తాన్ని ప్రాన్ ఖాతాల్లో జమ చేసి, మిగిలిన 90 శాతం నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు గత మూడు డీఏలకు సంబంధించి 15 నెలలుగా మొత్తం 28 బిల్లులను ట్రెజరీ కార్యాలయాలకు సమర్పించినప్పటికీ, ఇప్పటికీ వాటి చెల్లింపులు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లులు ప్రస్తుతం ఈ-కుబేర్ వ్యవస్థలో పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేసి సీపీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని కోరారు. అలాగే జూన్ 2 నుంచి అమల్లోకి రానున్న ఉద్యోగుల ఆరోగ్య కార్డుల పథకంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగి మూలవేతనం నుంచి నెలకు 1.5 శాతం చొప్పున కోత విధించనున్న నేపథ్యంలో, పథకానికి సంబంధించిన పూర్తి విధివిధానాలు, సేవలు అందించే దవాఖానల జాబితాను ముందుగా ప్రకటించాలని సూచించారు. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి కూడా ఇదే విధంగా వేతనంలో కోతలు విధిస్తే, పదవీ విరమణ అనంతరం వారికి కూడా ఆరోగ్య కార్డుల ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసిన తర్వాతే కోతలు అమలు చేయాలని, ఆరోగ్య పథకంలో చేరాలా వద్దా అనే విషయంలో ఉద్యోగులకు స్వేచ్ఛ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# బస్వాపూర్ శివారులో సూచిక బోర్డు ఏర్పాటు

**బంట్వారం మే 31 (జనం సాక్షి)** బంట్వారం మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో గ్రామ సర్పంచ్ ప్రవంతి శివరాజ్ ఆధ్వర్యంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చే ప్రజలు, వాహనదారులకు గ్రామ పరిధిని స్పష్టంగా తెలియజేయడం కోసం ఈ బోర్డును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ చర్య పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.







# ఆ హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చెయ్

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

- ఉచిత కరెంట్‌ను ఎగగొట్టేందుకే 'రైతు డిస్కం' కుట్ర
- హైడ్రా భూతంతో పేదల ఇళ్లు కూల్చుతున్న కాంగ్రెస్

**సికింద్రాబాద్, మే 31 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రైతులకు అందుతున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను పూర్తిగా రద్దు చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా 'రైతు డిస్కం'ను తీసుకువస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని అన్నారని, ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ మాటను ఆచరణలో పెట్టడానికే ఈ కుట్రకు తెరలేపారని విమర్శించారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, రేవంత్ రెడ్డికి రైతుల మీద అంతే ప్రేమ ఉందన్న కేటీఆర్, రైతు డిస్కం అంటే రైతన్న మెడకు ఉరితాడు బిగించడమేనని వ్యాఖ్యానించారు.

దేశ చరిత్రలోనే వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌దేనని, కేసీఆర్ గుర్తులు చెరిపేయాలనే కక్షతో కాంగ్రెస్ సర్కార్ చివరికి రైతుల నోట్లే మట్టికొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాలలో హైదరాబాద్ నగరానికి పైసా అభివృద్ధి చేయలేదని కేటీఆర్ విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చి ఇక్కడ 6,000 ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో అద్భుతమైన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, 20 వేల లీటర్ల ఉచిత తాగునీరు, లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా' భూతాన్ని తెచ్చి పేదల ఇళ్లను కూలగొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశమంతా కాంగ్రెస్ అనే దరిద్రాన్ని తిరస్కరిస్తే, తెలంగాణలో మాత్రం ఆ దరిద్రం తిరిగి వచ్చిందని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. రేవంత్ రెడ్డి చెప్పింది చేయడని, ఇచ్చిన హామీలను నెరవేర్చడనే విషయం ఇప్పటికే తెలంగాణ ప్రజలకు పూర్తిగా అర్థమైందని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకపోయినప్పటికీ, కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడాలని, ప్రజలకు అండగా నిలవాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో డ్రగ్స్ దాడులు

**ఉప్పల్, మే 31 (జనం సాక్షి):** నగరంలో మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టడం కోసం డ్రగ్స్ కంట్రోల్ అధికారులు చేపట్టిన ప్రత్యేక దాడుల్లో రామంతపూర్ ప్రాంతంలో సంచలనం చోటుచేసుకుంది. నియంత్రిత ఔషధాలను ప్రిస్క్రిప్షన్ లేకుండా అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రామంతపూర్‌లోని ఎసఎసఆర్ మెడికల్స్‌పై నిర్వహించిన తనిఖీలో కోడైన్ ఫాస్ఫేట్ కలిగిన టాసెక్స్ దగ్గు సిరప్‌లు, ట్రమడోల్ కలిగిన స్పాస్మో ప్రాక్సీవాన్ ప్లస్ క్యాప్సూల్స్ భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా వైద్యుల సూచన లేకుండా ఈ మందులు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు.

డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం ప్రత్యేక నియంత్రణలో ఉండే ఈ ఔషధాలను అక్రమంగా నిల్వ చేసి విక్రయించడం తీవ్ర ఉల్లంఘన అని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీ సమయంలో స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు-అమ్మకాల బిల్లులు, ప్రిస్క్రిప్షన్ రికార్డులు, నిల్వల వివరాలు తదితర పత్రాలను కూడా స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ప్రాథమిక విచారణలో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో షాపు నిర్వాహకులు రాజు, వి. సావిత్రిలపై విచారణ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో యువతలో కోడైన్ సిరప్ లు, ట్రమడోల్ వంటి మందులను మత్తు కోసం దుర్వినియోగం చేసే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అధికారులు మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి హాని కలిగించే ఈ అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే లైసెన్సులు రద్దు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు మందులు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత ఔషధాలు వాడవద్దని సూచించారు. నగరవ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద నూతన బస్ షెల్టర్ ప్రారంభం

### ప్రయాణికులకు సౌకర్యం.. ట్రాఫిక్ సమస్యలకు చెక్

**సికింద్రాబాద్, మే31(జనం సాక్షి):** ప్రయాణికుల సౌకర్యం, ట్రాఫిక్ నిర్వహణ మెరుగుదల లక్ష్యంగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ బస్ షెల్టర్‌ను తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్ షెల్టర్ పక్కనే వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఇంతకు ముందు బస్సులు ప్రధాన రహదారిపైనే ఆగి ప్రయాణికులను ఎక్కించడం, దింపడం వల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడేవి. అలాగే బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండ, వర్షం వంటి వాతావరణ పరిస్థితుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని బస్ షెల్టర్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు మార్గదర్శకత్వంలో ఎస్ఐ ఉగేందర్, ఏఎస్ఐ రెడ్డి నాయక్, పీసీలు రవికాంత్, సాయి, హోంగార్డులు శ్రీనివాస్ రెడ్డి, మహేష్ నాయక్‌తో పాటు స్థానిక ప్రజల సహకారంతో బస్ షెల్టర్ నిర్మాణం పూర్తి చేశారు.

నూతన బస్ షెల్టర్ అందుబాటులోకి రావడంతో బస్సులు రహదారిపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా సురక్షితంగా ఆగే అవకాశం ఏర్పడింది. అదే సమయంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన నిరీక్షణ స్థలం కూడా లభించింది. ఈ ప్రజాహిత కార్యక్రమానికి బొల్లారం కాంగ్రెస్ నాయకుడు మురళీ యాదవ్, లాల్‌బజార్ ప్రాంత నాయకుడు బాలరాజు నాయక్ సహకారం అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ, ప్రజల సౌకర్యాలు, రహదారి భద్రతను మెరుగుపరిచే కార్యక్రమాల్లో ట్రాఫిక్ సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి పని చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి భాగస్వామ్య కార్యక్రమాలు ట్రాఫిక్ క్రమశిక్షణ, ప్రజా సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.

## రూ.4 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

**కాప్రా, మే 31 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కాప్రా డివిజన్‌లో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనుల్లో సీనియర్ సిటిజన్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.40 లక్షలు, సాకేత్ కాలనీలో ఓపెన్ జిమ్ మరియు చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటుకు రూ.25 లక్షలు, వోర్లా ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు, కాప్రా నాలా నుంచి సాయి సుమా టీ-జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు, గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కాప్రా డివిజన్‌లో మౌలిక వసతులు మరింత మెరుగుపడి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీఆరఎస్ నాయకులు బైరి నవీన్ గౌడ్, మరాఠి రవీందర్ రావు, మల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శివ పంచాయతన ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక అన్నదానంలో.. ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబా యాదవ్,కమిటీ సభ్యులు విజయరాజ్, ప్రకాష్, శ్రీకాంత్ రెడ్డి, గోవర్ధన్, పాండు,సత్య నారాయణ, కుమార్, విష్ణు చారి పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణంతో సుందరంగా మారిన ప్రభుత్వ కార్యాలయాలు

**ధారూర్ మే 31(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయల పరిసరాలు సీసీ రోడ్డు నిర్మాణంతో మరింత ఆహ్లాదకరంగా మారాయి.సుమారు రూ.10 లక్షల వ్యయంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.ఇప్పటి వరకు వర్షాకాలంలో బురద వర్షం నీటి నిల్వలతో ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులు.సిబ్బంది.ప్రజలు ఈ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా మారింది. నాణ్యతతో వెయ్యడంతో రూపొందించిన సీసీ రోడ్డు కార్యాలయ పరిసరాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం తహసీల్దార్.మండలం పరిషత్ కార్యాలయ ప్రాంగణలు పరిశుభ్రంగా సుందరంగా చూడముచ్చటగా కనిపిస్తూ సందర్శకులను ప్రజలను ఆకట్టుకుంటోంది.స్థానికులు ఈ అభివృద్ధి పనిపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా ప్రకటించాలి

- కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- త్యాగాలు, బలిదానాలు చేసిన మాకు ఏమీ లేవా?
- ఏ త్యాగం చేయని మీకు రాజ్యాధికారమా?
- అంబేద్కర్, జయశంకర్ ఆశయాలు సాకారం చేయాలి
- విశ్వకర్మల ఆత్మగౌరవం కోసం ఏకం కావాలి



**హయత్‌నగర్, మే 31 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద విశ్వకర్మ జేఏసీ వైస్ చైర్మన్ నందిపేట రవీంద్ర చారి అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వకర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగ చారి హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కులాల వారిగా జనాభా ప్రకటించిన నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులాన్ని ఒకే కులంగా గుర్తించి కుల జనాభా ప్రకటించి, పాలకమండలి వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అన్ని కులాల జనాభా ప్రకటించినా, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మను విడగొట్టి వృత్తులను కులాలుగా ప్రకటించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. అన్ని కులాలకు పాలకమండలి, కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రకటించినా విశ్వకర్మలకు మాత్రం ఇవ్వకపోవడం అవమానకరమని తెలిపారు. ప్రపంచీకరణ విధానాల వల్ల పంచ వృత్తులు దెబ్బతిని ఆర్థికంగా వెనుకబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విశ్వకర్మ ముద్దుబిడ్డకు 50 సంవత్సరాలు నిండిన సామాజిక పెన్షన్ కింద నెలకు 5 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే వేలాది మంది విశ్వకర్మలతో గాంధీభవన్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ సాధనలో మలిదశ అమరుడు శ్రీకాంత చారి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జేఏసీ వైస్ చైర్మన్‌లు పూసల శ్రీకాంత చారి, బెజ్జంకి ప్రభాకర చారి, మోత్కూరి మల్లా చారి, ఓదెల హైమావతి, నాగార్జున, రాజ్యలక్ష్మి, ఫిరంగి భాస్కరాచారి, పర్వతం సైదాచారి, మెగా శ్యామ్, ఒంగోజు వేనాచారి, పూసల ప్రవీణ్ చారి, మారోజు సునీల్ కుమార్, చీరాల జలంధర్ చారి, సదానంద చారి, అద్దంకి కృష్ణమాచారి, ఎస్. వెంకటేశ్వర్లు, రవి శంకర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.